# ప్రేమికులు

"సుధా!" పిలిచాడు రాజా తన ఒడిలో పడుకున్న సుధని.

"ఊ" పరవశంగా అంది సుధ.

"ఈ లోకంలో మనంతటి అదృష్టవంతులు ఎవరూ లేరేమో కదా! నిజంగా మన ప్రేమ చాలా గొప్పది", తన్మయంగా చెప్తున్నాడు.

"అవును! మన ఇంట్లో అంగీకరించకపోయినా మనం పెళ్ళి చేసుకుందాం!"

"అసలు నువ్వు లేకుండా నేను ఒక్క క్షణం కూడా బ్రతకలేను. నువ్వే నా సుధవి, రాగ సుధవి, జీవన సుధవి" రాజాలో భావావేశం పొంగిపొరలుతున్నది.

చీకటి పడడంతో పార్కు మూసే వేళవడంతో వాళ్ళిద్దరూ ఒకరినొకరు విడవలేనట్లుగా లేచారు. "అన్నట్లు సుధా రేపు మనం సినిమాకి వెళ్తున్నాం. మనిద్దరం కలిసివెళ్తున్న మొదటి సినిమా. లవ్, లవ్, లవ్. అమీర్‌ఖాన్, జూహీచావ్లా మనలాంటి జంటే. టిక్కెట్లు తీసి వుంచుతాను. ఫస్ట్ షోకి" అని చెప్పాడు రాజా.

** ** **

ప్రకటనలు, న్యూస్ రీలు అయిన తర్వాత సినిమా మొదలయింది. రాజా, సుధ ఒకరినొకరు ఆనుకున్నట్టుగా కూర్చున్నారు. అమీర్‌ఖాన్ కనబడగానే హాలంతా చప్పట్లతో అదిరిపోయింది. సుధ కూడా రెచ్చిపోయి చప్పట్లు కొట్టడమేకాక ఈల కూడా వేసింది. రాజాకి చికాకు కలిగింది.

ఆ తర్వాత తెరమీద అమీర్‌ఖాన్ కనబడినపుడల్లా "అబ్బ! సూపర్బ్, ఫెంటాస్టిక్, ఎంత ముద్దుగా వున్నాడో" అంటూ కామెంట్స్ చేయసాగింది సుధ. రాజాకు కోపం పరాకాష్ఠనందుకుంది. హీరోని అలా పొగుడుతుండేసరికి భరించలేకపోయాడు. "ఎందుకలా అరవడం! అసహ్యంగా! సిగ్గులేదా, అలా మరో మగాడ్ని పొగడడానికి" అంటూ ఎగిరిపడ్డాడు. "నీకు బాధగా వుందా అమీర్‌ను పొగిడితే! అంత అందంగా వున్నవాడి భార్య ఎంత అదృష్టవంతురాలో" అంది. రాజా మరి తట్టుకోలేకపోయాడు. "మరేం! వెళ్ళి వాడ్నే పెళ్ళి చేసుకో. నాకూ కావాలి జూహీలాంటి పెళ్ళాం. నీలాంటిదాన్ని పెళ్ళి చేసుకోకపోతే నాకేం గడవదా ఏం? ఛీ! బజారు మనిషి" అంటూ తిట్టాడు. అంతే అతని చెంప పేలిపోయింది. "ఛీ! నువ్వింత సంకుచితుడని అనుకోలేదు. నువ్వు పెళ్ళి చేసుకోకపోతే నాకేం పెళ్ళి జరగదా? నీకంటే అందగాళ్ళే వస్తారు. గుడ్‌బయ్!" అంటూ వెళ్ళిపోయింది. "పోవే! నన్ను బెదిరిస్తావా ఏం? నాకేం నేను మగమహారాజుని" అంటూ కాలర్ ఎగరేశాడు రాజా.

— పి.శ్రీరామమూర్తి

## ఆత్రేయ బాకీ కథ

ఆత్రేయ జ్ఞాపకాలు, 'సీల్డ్ కవర్' ఉత్తరమూ చదివాక ఆయనకు సంబంధించిన ఒక సందర్భాన్ని నేను పాఠకులకు తెలియజేయాలనుకుంటున్నాను. 'సీల్డ్ కవర్'లో మా అన్నయ్య శ్రీ వెంకటాచారి పేరు కూడా వున్నందువల్ల ఈ సందర్భానికి ఇంకా అగత్యమేర్పడింది.

దాదాపు ముప్పయ్యేళ్ళ క్రిందట మా అన్నయ్య శ్రీ వెంకటాచారి మద్రాసులో నివసిస్తుండగా, నేను అక్కడికి వెళ్ళాను. అప్పుడే ఆత్రేయగారు ఒక క్లిష్ట పరిస్థితి నెదుర్కోవలసి వచ్చింది. ఆత్రేయగారి ప్రియురాలి (గారికి)కి గుర్రపు పందాల అలవాటు వుండడంవల్ల అందుకుగాను ఆత్రేయ హామీ పైన మార్వాడీలనుంచి ఇరవై వేలు అప్పుతెచ్చి, ఆ తర్వాత ఆమె మద్రాసు మకాం మార్చేసింది. ఆ అప్పు పందెంలో గుర్రం పరుగెత్తినట్టు పరుగెత్తి పాతికవేలయింది.

మార్వాడీ కేసు పెట్టగా, ఆత్రేయ గారిమీద అరెస్టు, జప్తు వారంట్లతో మేజిస్ట్రేట్ ఆదేశాలు వెలువడ్డాయి. అప్పుడు మా అన్నయ్య చీఫ్ జస్టిస్ శ్రీ రాజమన్నార్‌ను కలిసి పరిస్థితిని విన్నవించి ఆయన ద్వారా నాలుగైదు రోజులు ఆ ఆదేశాలు అమలు జరగకుండా చేయగలిగారు. ఆ తర్వాత డబ్బు కట్టేందుకు ప్రయత్నాలు సాగించారు. మా అన్నయ్య అప్పుడొక మహానటుని దర్శించి, ఆత్రేయగారిని ఆదుకోమని కోరగా "నా దగ్గరేముంది?" అన్నాడా మహా నటుడు?!

అప్పుడు ఆయన ఇంకో మహా నటుని వద్దకు వెళ్ళి విషయం వివరించగా, ఆ నటుడు వెంటనే పాతిక వేలకు చెక్కు రాసియిచ్చి, డబ్బు వెంటనే ఇవ్వమని బ్యాంకివాళ్ళకు ఫోన్ చేసి మరీ చెప్పారు. ఆ తర్వాత మా అన్నయ్య కోర్టులో డబ్బు కట్టి ఆత్రేయగారిని ఆ గండం నుంచి తప్పించారు.

— మాడభూషి వెళ్ళయాచారి, హైదరాబాద్

(ఆదుర్తి 53వ పేజీ తరువాయి)

(ఖైదీబాబాయ్), పెండ్యాల నాగాంజనేయులు (బుల్లెమ్మ-బుల్లోడు), టి.మాధవరావు (తాళిబొట్టు), పి.చంద్రశేఖరరెడ్డి, ఎం.మల్లికార్జునరావు (గూఢచారి 116), ఎం.నందకుమార్ (ఇదేనా న్యాయం) సుబ్బారావుగారి వద్ద సహాయ దర్శకులుగా పనిచేశారు.

రచయితలు ముళ్ళపూడి వెంకటరమణ (దాగుడుమూతలు), ఎస్.ఆర్.నంది (కన్నె మనసులు), డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు (ఇద్దరు మిత్రులు), మోదుకూరి జాన్సన్ (మరో ప్రపంచం), సత్యానంద్ (మాయదారి మల్లిగాడు) సుబ్బారావుగారి చిత్రాల ద్వారా పరిచయం చేయబడినవారే!

'మూగమనసులు' చిత్రాన్ని హిందీలో 'మిలన్' పేరిట డైరెక్ట్ చేశారు. అందులో నాయక పాత్రధారి సునీల్‌దత్ తన తమ్ముడితో నిర్మించిన 'మన్ కా మీత్'ను డైరెక్ట్ చేశారు. తాను డైరెక్ట్ చేసిన తెలుగు సినిమాలు- తేనెమనసులు (డోలీ), దాగుడు మూతలు (జ్వార్‌భలా) హిందీలో డైరెక్ట్ చేశారు. తాను స్వంతంగా నిర్మించిన 'దర్పణ్'కు పేరు వచ్చినంతగా డబ్బు రాలేదు. అందుకని, 'పూలరంగడు' హిందీలో స్వంతంగా తీశారు. 'జీత్' అని పేరు. 'జీత్' అంటే విజయం. కాని పరాజయమే ఎదురైంది. ఆర్థికంగా ఇబ్బందులు- మానసికంగా బాధలు.

తెలుగులో చిత్రం తీయాలనుకున్నారు. 'మాయదారి మల్లిగాడు' ప్రారంభించారు. 'రంగుల్లో తీయగలమా?' అని సందేహిస్తూ నలుపు తెలుపుల్లో కూడా తీశారు మొదటి రోజున. చివరకు రంగుల చిత్రంగా రూపొందింది. విజయవంతమైంది.

తర్వాత 'గాజుల కిష్టయ్య' ప్రారంభించారు. బయట నిర్మాతల చిత్రాలు 'గుణవంతుడు', 'క్షేత్రయ్య' అంగీకరించారు. అన్ని షూటింగ్‌లు ప్రారంభమయ్యాయి. 'గాజుల కిష్టయ్య' సెన్సారుకు సిద్ధమైంది. అప్పుడే ఆయన ఆరోగ్యం తొలిసారిగా పాడైంది. డాక్టర్లు పరీక్షలు చేశారు. ఫలితాలు రావలసి వుంది. వాటి గురించి తెలుసుకోకుండానే- 'క్షేత్రయ్య' షూటింగుకు బెంగుళూరు వెళ్ళారు 'డ్యూటీ ఫస్ట్' అంటూ.

అక్కడ నాలుగైదు రోజులు షూటింగు చేయగలిగారు. ఆరోగ్యం మరీ దిగజారింది. మనిషి మనలో వుండేవారు కాదు. అదే పరిస్థితుల్లో ఆయన్ని మదరాస్ తీసుకువచ్చారు.

"ఏరా! గాజుల కిష్టయ్య ఎలా పోతోందిరా?" అని అడిగారు. అప్పటికి పిక్చర్ సెన్సార్ కాలేదు. ఆయన మనలో లేరు.

"బాగానే పోతోంది" అన్నారు అంతా.

"బాగా ఎలా పోతుందిరా- అది బాగుంటే కదా!" అన్నారు.

ఆ పరిస్థితుల్లోనే ఆయన్ని హాస్పిటల్‌లో చేర్చారు. మనిషిని కృత్రిమంగా బతికిస్తున్నారు. గుండెకాయ, శ్వాస, లివర్, అన్నీ కృత్రిమాలే!

"ఎంత కాలమో కాదు- ఎంతసేపో చెప్పలేం- అందరికీ కబురుచేయండి" అన్నారు డాక్టర్లు

రావలసిన వాళ్లంతా వచ్చారు!

వెళ్లకూడని ఆదుర్తి మాత్రం వెళ్లిపోయారు!!

ఆ రోజు అక్టోబర్ 1, 1975.